సాక్షి
ములుగు

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



ఇక.. నేలమట్టం చేస్తారా?

కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. - 8లో



బాధితులకు సహాయం చేస్తాం

ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు, ఆస్తి, నష్టపోయిన బాధితులకు సహాయసహకారాలు అందజేస్తామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32^0 / 24^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండగా ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

పోకిరీలు.. పరుగో.. పరుగు

మహిళలకు రక్షణగా నిలుస్తున్న షీ టీమ్స్

- మఫ్టీలో సిబ్బంది...ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే అంతే సంగతులు
- నగరంలో 260 హాట్‌స్పాట్‌లు
- ఈ ఏడాది 214 ఫిర్యాదులు

వరంగల్ క్రైం: వరంగల్ మహానగరంలోని కళాశాలలు...పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో అమ్మాయిలు, మహిళలను టీజ్ చేసే యువకుల భరతం పడుతున్నాయి షీ టీమ్స్. పోకిరీలను పరుగులు పెట్టిస్తున్నాయి. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, అసభ్యకరంగా మాట్లాడినా మహిళలు వరంగల్ రామన్నపేటలో ఉన్న షీటీమ్స్ పోలీస్‌స్టేషన్‌కు నేరుగా, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారు.

ట్రై సిటీ పరిధిలో 260హాట్ స్పాట్‌లు..

ట్రైసిటీ పరిధిలో ర్యాగింగ్‌కు పాల్పడే ప్రాంతాలు (హాట్‌స్పాట్లు) 260 వరకు ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో షీ టీమ్స్ అధికారులు, సిబ్బంది నిత్యం నిఘా పెడుతున్నారు. ఉదయం, సాయంత్రం మఫ్టీలో తిరుగుతున్నట్లు సమాచారం. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో ర్యాగింగ్‌కు పాల్పడినట్లు 214 మంది యువతులు ఫిర్యాదు చేశారు. కౌన్సెలింగ్ దశలో పద్ధతి మార్చుకోని 92మందిపై కేసులు నమోదు చేశారు.



అవగాహన కార్యక్రమాలు

కళాశాలల్లో షీటీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిచయం లేని వ్యక్తులతో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో చాటింగ్ చేయడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, జీవితం మీద ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి, ఆన్‌లైన్ ప్రేమలు, కేరీర్, తదితర అంశాలపై యువతీయువకులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలను వేధిస్తే జీవితం ఎలా నాశనమవుతుందనే దానిపై యువకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 102 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి



పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. వారి సెల్‌ఫోన్ చెక్ చేస్తూ ఉండాలి. ప్రధానంగా అమ్మయిలు ఏదైనా సమస్య ఎదురైతే తల్లిదండ్రులకు, షీటీమ్స్ అధికారులకు చెప్పటానికి ధైర్యంగా ముందుకు రావాలి. ఫొటోల షేరింగ్ భవిష్యత్‌లో ఇబ్బందులకు గురిచేస్తుంది. పోకిరీలు అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధిస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. జాగ్రత్తగా ఉండాలి.

- కోడూరి సుజాత, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్

ఈ యేడాది షీటీమ్స్ స్టేషన్‌లో ఫిర్యాదులు, కేసులు ఇలా..

నెల	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు	మొత్తం
ఫిర్యాదులు	21	21	36	29	28	27	29	23	214
నమోదైన కేసులు	09	09	14	19	13	13	08	07	92
అవగాహన కార్యక్రమాలు	21	15	10	10	15	02	14	15	102

న్యూస్‌రీల్

వాహనాల స్క్రాప్ వేలంపాట

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని పనికిరాని సామగ్రి, వాహనాల స్క్రాప్‌ను వేలంపాట ఈ నెల 20వ తేదీన ఐటీడీఏ వద్ద వేయనున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.25వేలు డిపాజిట్ ఐటీడీఏ ఏటూరునాగారం పేరుపై డీడీ తీయాలని వివరించారు. ఈ నెల 18వ తేదీలోపు డీడీ చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను రూ.1000లు చెల్లించి కార్యాలయంలో నేటి నుంచి 18వ తేదీలోపు తీసుకోవాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676363101లో సంప్రదించాలని తెలిపారు.

పులి వచ్చిందనే వదంతులు నమ్మొద్దు



ఏటూరునాగారం: మండలంలోని రాంనగర్ గ్రామంలోకి పెద్దపులి వచ్చిందనే వదంతులు ఎవరూ నమ్మొద్దని ఏటూరునాగారం అటవీశాఖ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. మండల పరిధిలోని రాంనగర్‌లో కట్టమీద పులి ఉందని గురువారం గ్రామానికి చెందిన ఓవ్యక్తి చెప్పడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తమ సిబ్బంది అక్కడి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. అక్కడ కుక్క ఉంది తప్పా పెద్ద పులి వచ్చినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని ఆయన వెల్లడించారు. ప్రజలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి పోస్ట్ చేయాలన్నారు. అనవసరంగా ప్రజలను భయపెట్టొద్దన్నారు. ఏదైనా పులివచ్చిందనే ఆనవాళ్లు మీకు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల కోసం తాము ఎప్పుడు అందుబాటులో ఉంటామని వివరించారు.

వరదల నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించాలి



ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వచ్చిన వరదలతో కలిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి రాష్ట్రానికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, రోడ్లు, పంటలు, ఇళ్లు, రైలు మార్గాలు దెబ్బతిన్నాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టం అంచనా వేసి పరిహారం ఎకరాకు రూ. 30వేలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల రవీందర్, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, అయిలయ్య, నటరాజు, రాంబాబు, రాజేందర్, భిక్షపతి, నరేష్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న కలపకు సంరక్షణ కరువు

- ఫారెస్ట్ సెంట్రల్ టింబర్ డిపోలోని కర్రకు చెదలు
- లక్షలాది రూపాయల దుంగలు మట్టిపాలు



చెదలు పట్టి పాడైపోతున్న టేకు కలప



మట్టిలో కలిసిపోతున్న విలువైన దుంగలు

ఏటూరునాగారం: ఎవరైనా కలపను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం తెలియగానే అటవీశాఖ అధికారులు అక్కడికి క్షణాల్లో చేరుకుంటారు. ఆ కలపను స్వాధీనం చేసుకొని వాటికి జరిమానాలు విధిస్తూ కర్రను టింబర్ డిపోకు తరలిస్తుంటారు. కానీ స్వాధీనం చేసుకున్న కర్రను సంరక్షించడంపై మాత్రం అధికారులు శ్రద్ధ చూపడం లేదు. జిల్లాలోని ఏటూరునాగారం మండల కేంద్రంలో గల అటవీశాఖ సెంట్రల్ టింబర్ డిపో అటవీశాఖ ఎఫ్‌డీఓ, రేంజ్ కార్యాలయాల వెనుక ఉంటుంది. ఈ రేంజ్ కార్యాలయం ఆధ్వర్యంలో నడిచే కర్ర టింబర్ డిపో ఉంటుంది. అయితే అక్కడికి పలు ప్రాంతాల నుంచి అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.లక్షల విలువ చేసే కలపను తరలించి చెట్ల కింద విడివిడిగా నిల్వ చేసి లాట్ నంబర్లను వేస్తారు. కానీ ఆ కలప, దుంగలు, సైజులు, చెక్కలు ఇలా పలు రకాల కర్ర సైతం ఎండలో ఎండుతూ వానలో తడుస్తోంది. దీంతో లక్షలాది రూపాయల విలువ చేసే కర్రకు చెదలు పట్టి మట్టిలో కలిసిపోతోంది. ఇలా లక్షల రూపాయలు అటవీశాఖకు ఆదాయం వచ్చే వనరులు సైతం మట్టిపాలు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతినెలా 14న వేలంపాట

జిల్లాలో ములుగు, పస్రా, ఏటూరునాగారం డివిజన్లు ఉన్నాయి. మూడు డివిజన్‌ల పరిధిలో ఈ ఆరు నెలల వ్యవధిలో బీట్‌ల వారీగా రూ. 14లక్షల కర్రను సెంట్రల్ టింబర్ డిపోకు తరలించారు. ఇలా తరలించే కర్రను ప్రతినెలా 14వ తేదీన అటవీశాఖ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తుంటారు. అందులో నచ్చిన దుంగలను గుత్తేదారుడు పాడుకొని తీసుకెళ్తుంటారు. కానీ ఎండలో ఎండి వర్షంలో కర్ర తడుస్తుండడంతో ఆ కలపను కొనుగోలు చేసేందుకు వేలం పాటదారులు ముందుకు రావడం లేదు. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇక్కడికి వచ్చి వేలం పాట పాడుకొని కర్రను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు కలపకు సరైన రక్షణ, నాణ్యత లేకపోవడంతో కొనుగోలు చేసేందుకు ఎవరూ మొగ్గు చూపడం లేదు. దీనివల్ల విలువైన కలప మట్టిపాలు అవుతుందని పలువురు వాపోతున్నారు.

రక్షణ కల్పిస్తే అధిక డిమాండ్

అటవీశాఖ అక్రమార్కుల నుంచి దాడి చేసి పట్టుకున్న కలపను పెద్ద షెడ్లు ఏర్పాటు చేసి వర్షం, ఎండకు పాడవకుండా నిల్వ చేస్తే ఆ కర్రకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. కర్రను తీసుకొచ్చి చెట్ల కింద పడవేయడంతో పాడైపోవడం వల్ల ధర పలికే అవకాశం లేకుండా పోతుంది. డిపోలో ఉన్న సిబ్బంది, అధికారులు సైతం దీనిపై దృష్టి పెట్టకపోవడం బాధాకరం. ఇప్పటికైనా కలపను నిల్వ చేసేందుకు షెడ్లను ఏర్పాటు చేయాలని వన ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.

కోర్టు కేసులున్న కర్రకు వేలం పాట నిర్వహించడంలేదు..



కోర్టు కేసులు ఉంటే అలాంటి కలపకు వేలం పాట ఉండదు. పట్టుకొచ్చిన దుంగలు వెంటనే వేలం పాట వేసి ఆదాయాన్ని అటవీశాఖకు జమ చేస్తాం. పాడవుతున్న కర్రకు సైతం వేలంపాట పెట్టాలని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే వాటికి కూడా వేలం పాట నిర్వహిస్తాం.

- అబ్దుల్ రెహమాన్, అటవీశాఖ రేంజ్ అధికారి, ఏటూరునాగారం

రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు

డీఎంహెచ్‌ఓ అప్పయ్య



మాట్లాడుతున్న అప్పయ్య

మంగపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సక్రమంగా వైద్యం అందడంలేదని, వైద్యాధికారి విధుల్లో సమయ పాలన పాటించడం లేదని, ఆస్పత్రికి వచ్చే వారికి వైద్యం అందించకుండా ప్రశ్నించే వారిపై దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. పీహెచ్‌సీలో వైద్యాధికారి, సిబ్బంది మధ్య కో ఆర్డినేషన్ లేదన్నారు. వారితో మాట్లాడి రోగులు ఇబ్బంది పడకుండా సరైన వైద్యం అందేలా చూస్తామని తెలిపారు. అవసరమైతే షోకాజ్ నోటీస్ జారీ చేస్తామన్నారు. కొంతమంది జ్వరం వస్తే ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయించి తగ్గపోవడంతో ప్లేట్‌లెట్స్ తగ్గడం వల్లే జ్వరం తక్కువ కావడం లేదనే అనుమానంతో వచ్చి సీబీపీ పరీక్ష చేయమని సిబ్బందిని అడుగుతున్నారని తెలిపారు. దీంతో ఒకే రోజు 100మందికి పరీక్షలు చేయడం కష్టంతో కూడుకున్న పని అన్నారు. కొంతమంది రిపోర్ట్ వచ్చే వరకు కూడా ఉండలేక పోతున్నారని వివరించారు. ప్రజలు జ్వరం వస్తే ఆర్ఎంపీలను ఆశ్రయించకుండా పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

అక్రమ డిప్యుటేషన్లు నిలిపివేయాలి

ములుగు రూరల్: ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లు నిలిపి వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విధులకు వెళ్లడం కష్టంగా ఉందని జిల్లా కేంద్రానికి డిప్యుటేషన్‌పై రావాలనే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. డిప్యుటేషన్ల కారణంగా విద్యార్థులకు పూర్తి స్థాయి విద్య అందదని తెలిపారు. డిప్యుటేషన్ల ప్రక్రియను నిలిపివేయకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

వెంకటాపురం(కె): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీవో ముత్తమ్మ అన్నారు. మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి కిశోర బాలికలే రేపటి శక్తివంతమైన మహిళలుగా ఉండాలంటే రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దుడపాక చంద్రకళ, మనోరమ, విజేందర్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు సుజన్, రాందాస్, వినోద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న రాజు

ఏటూరునాగారం: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ ఆర్షం రాజు అన్నారు. మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో యూడైస్‌ప్లస్ అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాలకు చెందిన అన్ని యజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. పాఠశాలల భౌతిక వసతులు వివరాలు క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని అప్‌డేట్ చేయాలన్నారు. యూడైస్‌లో ఉన్న సమాచారాన్ని అనుసరించి ప్రభుత్వ నిధులు కేటాయిస్తుందన్నారు. యూనిఫామ్స్, ఉచిత పాఠ్య పుస్తకాలు వస్తాయని తెలిపారు. నిర్ణీత గడువులోపు యూడైస్ సమాచారాన్ని అప్‌డేట్ చేయాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం ఎంఈఓ రాజేష్, మండల నోడల్ అధికారి కొయ్యడ మల్లయ్య, ఏటూరునాగారం కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సాంబశివరావు, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

'నిబంధనల మేరకే టెండర్ దక్కించుకున్నాం'



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ములుగు: ములుగు జిల్లా ధాన్యం రవాణా టెండర్లను నిబంధనల మేరకే బిడ్డింగ్ ద్వారా టెండర్ దక్కించుకున్నామని జిల్లా లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కోడె రాంబాబు అన్నారు. జాకారం సమీపంలోని ములుగు తాలూకా లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. కొంత మంది కావాలని తమపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అందులో ఎలాంటి నిజం లేదన్నారు. ములుగులో మూడు సెక్టార్లకు గాను రెండు సెక్టార్లను దక్కించుకోవడం సంతోషకరమన్నారు. మరో సెక్టార్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోనేరు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, గాజుల నారాయణ, ఖాజా పాషా, బద్దం శ్రీనివాసరెడ్డి, ఎండీ ఖాదర్, భిక్షంరెడ్డి, సతీష్, కుత్బోద్దీన్, సంజీవరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- మండలంలోని పలు అభివృద్ధి పనులు ప్రారంభం



విజయలక్ష్మి మహిళా సమాఖ్య గ్రూపు సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి సీతక్క



గోవిందరావుపేట మండలంలోని ఫ్రూట్ ఫారం బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్/గోవిందరావుపేట: గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్‌తో కలిసి మండల పరిధిలోని పలు అభివృద్ధి పనులను మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణాలను మంజూరు చేసి స్వయం ఆర్థిక సంపాదకులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్వయం ఉపాధితో మహిళలు 17 రకాల వ్యాపారాలు చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. జిల్లాలో 20 ఎకరాల భూమి కేటాయించి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళా సంఘాలకు అప్పగిస్తామని తెలిపారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందించే రుణాలకు వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. జిల్లాలోని సెంట్రల్ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల తరగతులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. ములుగు నియోజకవర్గంలో రూ.200కోట్లతో అభివృద్ధి పనులకు నివేదికలు అందించామని వ్యాఖ్యానించారు. జిల్లాకు రైతు రుణమాఫీ కింద ప్రభుత్వం రూ.190 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బ్యాంకర్ల నిర్లక్ష్యం కారణంగా కొంత మంది రైతులకు రుణమాఫీ రాలేదని వివరించారు. రైతుల రుణమాఫీకి బ్యాంకర్లు సహకరించాలని కోరారు. రుణమాఫీ కాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి సూచించారు. ధరణి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. మోకాలో ఉన్న రైతులకు పట్టాలు అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాంచంద్రాపూర్‌లో గతం నుంచి రైతులు కాస్తుకాలంలో కొనసాగే వారని అలాంటింది కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధరణి తీసుకొచ్చి తిరిగి ఉమర్‌ఖాన్ పేరున పట్టాలు తీసుకు వచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వందశాతం పట్టాలు జారీ చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, ఆర్‌డీఓ సత్యపాల్ రెడ్డి, ఈఈ వీరభద్రం, ఆర్‌అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మల్లంపల్లిలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రుణాలు పొంది ఏర్పాటు చేసిన మహాలక్ష్మీ మిల్క్ పార్లర్, ఎంబ్రాయిడరీ, కిరాణం, ఫొటో స్టూడియోలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ రోడ్డు నుంచి రాంసింగ్‌తండా వరకు రూ.1.10కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును, శివతండా నుంచి నొర్యతండా వరకు రూ.1.20కోట్లతో నిర్మించిన బీటీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం జాకారం పరిధిలో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రాన్ని రూ.28.25లక్షలతో నిర్మించగా భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లా కేంద్రం నుంచి బుద్దారం వరకు రోడ్డును, ములుగు పట్టణంలో నాలుగు వరుసల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జగ్గన్నపేట పంచాయతీ పరిధి పులిగుండం నుంచి చింతకుంట వరకు రూ. 70లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అలాగే గోవిందరావుపేట మండల పరిధిలోని ఫ్రూట్ ఫారం గ్రామంలో రూ.1.86కోట్లతో ఎన్‌హెచ్ 163 బీటీ రోడ్డు నుంచి ఫ్రూట్ ఫారం వరకు బీటీ రోడ్డును ప్రారంభించారు. అలాగే పాత నాగారం నుంచి నేతాజీనాగారం వరకు రూ.66లక్షల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ దివాకరలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొద్ది రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా కర్లపల్లి గ్రామానికి చెందిన మడవి ఎదుమయ్య పిడుగుపడి చనిపోగా అతని భార్య సునీతకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మీ, అనిల్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

ములుగు రూరల్: భారత దేశ కీర్తి, ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో మాట్లాడి దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీశారని, తక్షణమే దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్లంపల్లి జాతీయ రహదారిపై మండల పార్టీ అధ్యక్షుడు గాదం కుమార్ అధ్యక్షతన గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బలరాం హజరై మాట్లాడారు. రాహుల్ గాంధీ దేశంపై అక్కసుతో రిజర్వేషన్ల రద్దుకు తెరలేపుతూ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. దేశ ప్రతిష్టకు గాని, కించపరిచే విధంగా మాట్లాడితే ప్రజలు బుద్ధి చెబుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డి, రవింద్రాచారి, గుగులోత్ స్వరూప, లవణ్, రాజ్‌కుమార్, మహేందర్, వెంకటేష్, రవిరెడ్డి, ఓదెలు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలు రైళ్లకు ఎక్స్‌పర్మెంటల్ స్టాప్

- ఆరు నెలల పాటు హాల్టింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు పలు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌పర్మెంటల్ (ప్రయోగాత్మక) స్టాప్ కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఆరు నెలల పాటు ఈ రైళ్లకు హాల్టింగ్ కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఈ స్టేషన్లలో రైళ్లకు స్టాప్..

ఈనెల 13వ తేదీ నుంచి ఆరు నెలల పాటు సికింద్రాబాద్–దానాపూర్ (12791) దానాపూర్ ఎక్స్‌ప్రెస్, దానాపూర్–సికింద్రాబాద్ (12792) ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో, ఈ నెల 14వ తేదీ నుంచి నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 13వ తేదీ నుంచి నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్‌లో, ఈ నెల 20వ తేదీ నుంచి పూణె–కాజీపేట (22152) పూణె ఎక్స్‌ప్రెస్, ఈ నెల 22వ తేదీ నుంచి కాజీపేట–పూణె (22152) పూణె ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సింగపూర్‌లో ఉద్యోగం పేరుతో మోసం..

- రూ 6.93 లక్షలు తీసుకున్న బ్రోకర్
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

హసన్‌పర్తి: సింగపూర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ బ్రోకర్ తనను మోసం చేశాడని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు గురువారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన నామ్ శివకుమార్ ఇదే ప్రాంతానికి చెందిన నన్నంశెట్టి శ్రీహరికి సింగపూర్‌లో ఉద్యోగం ఆశ చూపాడు. ఇందుకు సింగపూర్ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సు పూర్తి చేయాలని చెప్పాడు. ఆ యూనివర్సిటీలో అడ్మిషన్ ఇప్పించే బాధ్యత తనదేనని పేర్కొన్నాడు. దీనిని నమ్మిన శ్రీహరి విడతల వారీగా శివకుమార్‌కు రూ 6.93 లక్షలు ముట్టజెప్పాడు. ఈ క్రమంలో సింగపూర్‌కు వెళ్లడానికి కావాల్సిన పత్రాలు ఇవ్వకపోవడమే కాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో తనను మోసం చేసిన శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీహరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

22న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–15 బాల బాలికల చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 01, 2009 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను నవంబర్‌లో వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు చెస్ బోర్డును తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇక.. నేలమట్టం చేస్తారా?

కేయూ భూమిలో ఆక్రమణలు

- 13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తింపు
- బౌండరీస్ ఫిక్స్ చేస్తూ మార్కింగ్ చేసిన విజిలెన్స్ అధికారులు
- ఒకటి,రెండు రోజుల్లో వర్సిటీకి సర్వే రిపోర్టు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. యూనివర్సిటీలోని న్యూ పీజీ హాస్టల్ భవనం సమీపంలోని బీసీ కాలనీ ప్రాంతంలోని 228 సర్వే నంబర్ భూమిలో విజిలెన్స్ అధికారులు ఆయా శాఖల సిబ్బందితో జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే చేపట్టారు. బౌండరీస్ ఫిక్స్ చేస్తూ మార్కింగ్ చేశారు. 229 సర్వే నంబర్‌లో ఆరు ఎకరాల 15 గుంటల భూమి ఉండాలనే కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారుల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం సర్వే నిర్వహించారు. ఇందులో కొంత భూమి ఆక్రమణ జరిగిందని గుర్తించారని సమాచారం. ఈ నేపథ్యంలో ఆక్రమణలదారులపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీలో చర్చ సాగుతోంది.

ఒకటి,రెండురోజుల్లో వర్సిటీకి రిపోర్టు

కేయూలోని 229 సర్వే నంబర్‌భూమిలో ఆక్రమణలు జరిగాయని స్పష్టమవుతోంది. ఈ సర్వే సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి అక్కడికి వచ్చి పరిశీలించారు. బిల్డింగ్ డివిజన్ అధికారి వాసుదేవరెడ్డి, ఇతర సిబ్బంది కూడా ఉన్నారు. ఆ 229 సర్వేనంబర్‌లోని భూమి వివరాల సర్వే రిపోర్టు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈనెల 12 లేదా 13న సర్వే రిపోర్టు యూనివర్సిటీ అధికారుల చేతుల్లోకి రానుంది.

గతంలో కూడా ఆక్రమణలు జరిగినట్లు వెల్లడి

కాకతీయ యూనివర్సిటీలో 2022లో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులోనూ 229 సర్వేనంబర్ భూమిలో ఆక్రమణలు జరిగినట్లు గుర్తించి రిపోర్టు ఇచ్చారు. అయితే పక్కన ఉండే వేరే సర్వే నంబర్ చూపి 229 సర్వేనంబర్ భూమిలో 13మంది ఇళ్లు నిర్మించుకున్నారనే ఆరోపణలున్నాయి. అప్పట్లోనే 13 మంది యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. ఇందులో ప్రధానంగా కేయూకు చెందిన ముగ్గురు ఉద్యోగుల ఇళ్లు ఉన్నాయని వెల్లడైన విషయం విదితమే. అయినా అప్పటి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అలాగే, కేయూ ల్యాండ్‌కమిటీ చైర్మన్ నాగేంద్రబాబు కమిటీ రిపోర్టునూ అప్పటి యూనివర్సిటీ అధికారులు పట్టించుకోలేదు. ఈతాజా సర్వే రిపోర్టు రాగానే కేయూ భూమిలోని ఆక్రమణలు తొలగించి భూమిని స్వాధీనం చేసుకుంటారా లేదో అనే అంశంపై వేచి చూడాలి. కాగా, కేయూ పలివేల్పుల శివారు 412, 413, 414 సర్వేనంబర్లు, అలాగే లష్కర్ సింగారం శివారు 34 సర్వేనంబర్‌లో కూడా విజిలెన్స్‌అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్ జరిగింది. ఈప్రాంతంలో ఇంకా సర్వే పూర్తిచేయాల్సిందని కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారులు చెబుతున్నారు.



కేయూలోని 229 సర్వేనంబర్‌లోని భూమి సర్వేను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తింపు!

విజిలెన్స్ అధికారులు వివిధ శాఖలతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నిర్వహించగా కేయూకు చెందిన 229 సర్వేనంబర్ భూమిలో 13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తించారని సమాచారం. అందులో ఇద్దరు ముగ్గురు కేయూకు చెందిన ఉద్యోగుల ఇళ్లు కూడా ఉన్నట్లు గుర్తించారని తెలుస్తోంది. అక్కడ ఉన్న సీసీ రోడ్డులో కొంతభాగం యూనివర్సిటీకి చెందిన భూమిగా గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. దీంతో అక్కడ నివాసమంటున్న వారిలో ఆందోళన మొదలైంది.

ఆక్రమణలను తొలగిస్తారా ?

కేయూలోని 229 సర్వేనెంబర్ భూమిలో సర్వే పూర్తయింది. ఆ భూమిలో ఆక్రమణలు జరిగినట్లు స్పష్టమైంది. ఇందులో 13మంది ఇళ్లు ఉన్నాయని బౌండరీల ఫిక్స్‌తో వెల్లడైంది. సర్వే రిపోర్టు సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి రానున్న నేపథ్యంలో ఇక ఆక్రమణలో ఉన్న ఇళ్లను తొలగించి యూనివర్సిటీ భూమిని స్వాధీనం చేసుకుంటారా లేదా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. కేయూ భూమిలో 13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తించిన విషయం యూనివర్సిటీ అధికారులు బుధవారం కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. బిల్డింగ్ డివిజన్ అధికారి వాసుదేవరెడ్డితో చర్చించారు. సర్వేరిపోర్టు రాగానే ఎలా ముందుకెళ్లాలనే విషయంలో చర్చించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇన్‌స్పెక్షన్ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది.

ముంపు ప్రాంతాల్లో శాస్త్రవేత్తల పర్యటన

- క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మరిపెడ రూరల్: మండలంలోని ముంపు గ్రామాలు ఉల్లెపల్లి, సీతారాంతండా, బాల్నిధర్మారం గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.వీరన్న, డాక్టర్ వి.సతీశ్‌చంద్ర, మాల్యాల కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ మాలతి, డాక్టర్ కిశోర్ కుమార్, బి. క్రాంతికుమార్ మంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి, ఆయిల్ పామ్ తదితర పంటలను పరిశీలించారు. వరదల తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీఏఓ ఎం.విజయనిర్మల, ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ బోడ వీరసింగ్, రైతు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతరపంటలు లాభదాయకం..

కురవి: ఆయిల్‌పామ్ రైతులు అంతర పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి జయనిర్మల, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.వీరన్న, డాక్టర్ వి.సతీశ్‌చంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు.ఆ తోటల్లో అంతర పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.మాలతి, డాక్టర్ ఎస్.కిశోర్, డాక్టర్ బి.క్రాంతికుమార్, డాక్టర్ ఇ.రాంబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: బాల్నిధర్మారంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఏసోబుకు నేతల ఘన నివాళి

మడికొండ: కాజీపేట మండలం టేకులగూడెంలో గురువారం మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణధీర్‌దాదా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతోపాటు పలువురు నేతలు ఏసోబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం నాలుగు దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మాచర్ల ఏసోబు అని పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ జక్కుల రవీందర్, విరసం నేతలు ప్రొఫెసర్ కాశీం, బాలసాని రాజన్న, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, గాదె ఇన్నయ్య, శాంతక్క రమాదేవి, సత్యేంద్ర, తెలంగాణ ప్రజాఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పా కాల వెంకన్న, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు నున్న అప్పారావు, అమరవీరుల బంధుమిత్రుల సంఘం, విప్లవ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



ఏసోబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బాధితులకు సాయం చేస్తాం

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు, ఆస్తి నష్టపోయిన బాధితులకు సహాయసహకారాలు అందజేస్తామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బాధితులకు అన్ని విధాలా సాయం అందజేస్తామన్నారు. మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలో వర్షాలతో పంట, ఆస్తి నష్టం అధికంగా జరిగిందన్నారు. ఆకేరు వాగులో పడి వ్యవసాయ యువ శాస్త్రవేత అశ్విని, ఆమె తండ్రి మృతి చెందడం బాధాకరమన్నారు. జిల్లాలో జరిగిన పంట, ఆస్తి నష్టం నివేదికలను అధికారులను త్వరలో ప్రభుత్వానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి డోలి సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అంబటి శ్రీనివాస్, కుంట్ల ధర్మార్జున్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సయ్య, వరంగల్ అధ్యక్షుడు జావేద్, నాయకులు పిల్లి సుధాకర్, మాలోత్ రవికుమార్, ఇరుగు మనోజ్ కుమార్, గాడిపెల్లి అనిల్, నాగయ్య, హన్మంతు, లాలయ్య, టీపీజేఏసీ అధ్యక్షుడు మైస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

వరద బాధితులకు జీవనాధారం కల్పించాలి..

నెల్లికుదురు : భారీ వర్షాలకు పంటలతోపాటు ఆస్తి నష్టం సంభవించిన బాధితులకు వెంటనే జీవనాధారం కల్పించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం కోరారు. ఈ మేరకు గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాలలో పర్యటించి బాధితులను పరామర్శించారు. పూర్తిగా నష్టపోయిన బాధితులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. తెగిన చెరువు కట్టలకు వెంటనే మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలని ఫోన్ ద్వారా కలెక్టర్‌ను కోరారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఏ పరిహారం అందకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన ఓయూ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్వర్లు తల్లి శ్రీరాం సుబ్రమ్మ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

జక్కలొద్ది భూపోరాటానికి ‘ఏచూరి’ మద్దతు

- గుడిసెవాసులకు భరోసా
- ఇళ్ల స్థలాలు సాధించే వరకు అండగా ఉంటానని అభయం
- ఏచూరి మృతికి పలువురి సంతాపం

న్యూశాయంపేట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి.. వరంగల్‌లో జరిగిన పోరాటాలకు మద్దతు తెలిపారు. గురువారం ఆయన మరణవార్త విన్న అభిమానులు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు కన్నీటిపర్యంతమయ్యారు. రెండేళ్ల క్రితం సీపీఎం ఆధ్వర్యంలో వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో భూపోరాటాలు జరిగాయి. పేదలు తమ నివాస స్థలాలకోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. రంగశాయిపేట శివారు జక్కలొద్ది భూపోరాట కేంద్రంగా ఉద్యమాలు నడిచాయి. 2022 జూలై 25, 26, 27 తేదీల్లో హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలవికాసలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. సమవేశాల సందర్భంగా వరంగల్ జక్కలొద్ది భూపోరాట కేంద్రాన్ని సందర్శించి పేదల పోరాటానికి మద్దతుగా నిలిచి భరోసా కల్పించారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాటానికి మద్దతుగా ఉంటానన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో..

2023 మార్చిలో కాకతీయ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో ‘భారతదేశం ప్రస్తుత పరిస్థితులు– లౌకిక వాదం’ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగించారు.

సీపీఎం నాయకుల సంతాపం..

సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని వరంగల్, హనుమకొండ జిల్లాల సీపీఎం నాయకులు అన్నారు. ఏచూరి మృతికి సంతాపం తెలుపుతూ ఆయా జిల్లాల పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం.చుక్కయ్య, చక్రపాణి, ఉప్పలయ్య, ఆర్. రమేశ్, వరంగల్ జిల్లా సీఐటీయూ నాయకులు ఎం.సాగర్, జి.వెంకట్, లింగయ్య, వీరన్న, సీతారాం పాల్గొన్నారు.

సీపీఐ నేతలు..

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కె.భిక్షపతి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.



హనుమకొండలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



వరంగల్ జక్కలొద్దిలో భూపోరాటాలకు మద్దతు తెలుపుతున్న ఏచూరి(ఫైల్)

నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వందేభారత్..

- కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. ఇప్పటికే కాజీపేట, వరంగల్ మీదుగా సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. ప్రయాణికుల డిమాండ్ మేరకు సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య ఈ నెల 15వ తేదీ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడిపించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. ఈ రైలు వారానికి ఆరు రోజులు నడిపించనున్నారు. కాజీపేట జంక్షన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభానికి పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలును ప్రధాని మోదీ వర్చువల్‌లో ప్రారంభించనున్నట్లు వివరించారు.

రైలు షెడ్యూల్..

ఈ నెల 15వ తేదీన నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20101) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి 10.04 గంటలకు కాజీపేట జంక్షన్‌కు, 12.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. అదేవిధంగా సికింద్రాబాద్–నాగ్‌పూర్ (20102) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 14.20 గంటలకు చేరుకుని, రాత్రి 20.20 గంటలకు నాగ్‌పూర్‌కు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌కు అప్‌అండ్‌డౌన్ రూట్‌లో సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. స్వల్ప మార్పులు, చేర్పులతో అధికారికంగా వందేభారత్ సమయ వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎద్దు దాడిలో రైతు మృతి

గీసుకొండ: ఎద్దు దాడిలో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శాయంపేట హవేలిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సముద్రాల సాంబయ్య(58) ఈ నెల 11న మేత నిమిత్తం తన ఎద్దులను తోలుకుని చేను వద్దకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో అందులో ఒక ఎద్దు హఠాత్తుగా పరుగెత్తుకుంటూ వచ్చి సాంబయ్యను కింద పడేసి తొక్కింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాంబయ్యను వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా అదే రోజు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నన్నట్లు గీసుకొండ సీఐ బాబూలాల్ గురువారం తెలిపారు.



సాంబయ్య(ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు..

రేగొండ: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి మండలంలోని నారాయణపూర్ స్టేజీ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి (బి) గ్రామానికి చెందిన మేరుగు రవికుమార్ (35) ద్విచక్రవాహనంపై రేగొండ నుంచి కొత్తపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నారాయణపురం స్టేజ్ వద్ద భూపాలపల్లి నుంచి పరకాల వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య మనీషా, కూతురు, కుమారుడు ఉన్నారు.



రవికుమార్ (ఫైల్)

పది కిలోల వెండి పట్టివేత

- వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట ఘటన

రామన్నపేట : వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట గురువారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ముగ్గురు వ్యక్తుల వద్ద పది కిలోల వెండి లభ్యమైనట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఈ మేరకు ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై వెంకన్న, ఇంటర్‌సెప్టార్ సిబ్బంది రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడులోని సేలంకి చెందిన కన్నన్, మురుగేషన్, గోకుల్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని తనిఖీ చేయగా పది కిలల్లో వెండి లభించింది. వెండికి సంబంధించిన బిల్లుల గురించి ప్రశ్నించగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

- ఎస్‌ఏసీఓ ఏడీజీ డాక్టర్ భవానీసింగ్

ఎంజీఎం: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ సంక్రమించే విధానం, నివారణపై యువతకు పూర్తి అవగాహన ఉండాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఎన్‌ఏసీఓ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ భవానీసింగ్ అన్నారు. ఎన్‌ఏసీఓ బృందం గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. ముందుగా వారు నగరంలోని ఏవీవీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్‌ఏసీఓ ఏడీజీ భవానీసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు హెచ్‌ఐవీ గురించి లైంగికపరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండడమే కాకుండా.. ఇతరులతో స్వేచ్ఛగా మాట్లాడగలగాలన్నారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్, ఐసీటీసీ, వైరాలజీ ల్యాబ్‌లను బృంద సభ్యులు సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, పరీక్షల నిర్వహణ, కౌన్సిలింగ్ , చికిత్స విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌ఏసీఓ కన్సల్టెంట్ డాక్టర్ పారుల్‌సింగ్, టీజీఎస్‌ఏసీఎస్ అడిషనల్ పీడీ డాక్టర్ ప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు, ఏవీవీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్‌కుమార్, ఎస్‌ఎం డాక్టర్ సీహెచ్. సూర్యప్రకాశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, డీఏపీసీయూ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భవానీసింగ్

భద్రకాళి ఆలయంలో గతి తప్పిన పాలన



దేవాదాయశాఖ ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిషత్ సభ్యులు

- అడుగడుగునా డబ్బులు దండుకుంటున్న వ్యాపారులు
- ఈఓ శేషుభారతిపై దేవాదాయశాఖ ఉప కమిషనర్‌కు ఫిర్యాదు

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళి అమ్మవారు. అమ్మ చల్లని చూపు కోసం వందల కిలోమీటర్లు ప్రయాణించి వస్తుంటారు. నిత్యం భక్తుల రద్దీతో కళకళలాడే ఈ ఆలయం ద్వారా దేవాదాయశాఖకు అధిక ఆదాయం సమకూరుతోంది. అమ్మవారి ఉత్సవాల కోసం లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చే దాతలున్నారు. గుప్తంగా విరాళాలందించే దాతలు కూడా అనేకం. హుండీల నుంచి లభించే ఆదాయమే కాకుండా భక్తులు నిర్వహించే పూజా రుసుము ద్వారా లభించే ఆదాయం కూడా ఎక్కువే. ఇంతే కాకుండా.. పూలమాలలు, ప్రసాదాలు, ఒడిబియ్యం, ముడి సరుకులు, నెయ్యి, తేనె, తదితర సరుకులను అందించే దాతలెందరో ఉన్నారు. అమ్మవారి కైంకర్యాలకు దాతలు ఆదాయం అందించే దేవాలయం. ఇలాంటి దేవాలయం పాలన గాడి తప్పుతోంది. ఇటీవల కాలంలో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

దర్జాగా దోపిడీ..

భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించగానే కొబ్బరికాయలు, పూల అమ్మకం నుంచి దోపిడీ ప్రారంభమవుతుంది. దేవాలయం నిర్ణయించిన రుసుము కంటే.. దాదాపు 200 శాతం రెట్లు వసూలు చేస్తున్నారు. వారు ఇచ్చే పూల బుట్టలో నాసిరకం, వడలిపోయిన పూలు ఉంటాయి. భక్తులు నిలదీస్తే వ్యాపారులు దూషించడం పరిపాటిగా మారిపోయింది. వాహన పూజల కోసం కొనుగోలు చేసే పూజా సామగ్రి సైతం అధిక ధరకు విక్రయిస్తున్నారు. గతంలో దసరా నవరాత్రుల్లో రెండు నిమ్మకాయలు, జీడి గింజలు, అమ్మవారి రక్షను రూ.500కు విక్రయించారు. చెప్పుల స్టాండ్‌లో ఉచితం అని బోర్డు పెట్టినప్పటికీ డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా దేవాలయంలో పని చేసే ప్రైవేట్ అర్చకుల దందా మితిమీరిపోయింది. వాహన పూజల కోసం, అన్నప్రాసన, అక్షరా భ్యాసం తదితర పలు పూజలు నిర్వహించుకునేందుకు దేవాదాయశాఖ టికెట్ ధర భక్తులకు అందుబాటులో ఉన్నప్పటికీ.. అర్చకులు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. అమ్మవారి బొట్టు పెట్టినందుకు, అమ్మవారికి సమర్పించిన పూలు ఇచ్చేందుకు కూడా డబ్బులు వసూలు చేయడం అన్యాయమని పలువురు భక్తులు ఆవేదన చెందుతున్నారు.

టెండర్ రద్దు చేయాలి..

అమ్మవారికి సమర్పించే చీర విషయంలో కూడా ఇటీవల వివాదం తలెత్తింది. దేవాలయంలో టెండర్ ప్రక్రియ ద్వారా కొనసాగుతున్న విధివిధానాలు ఉల్లంఘించిన వారి టెండర్ రద్దు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈమేరకు గురువారం భద్రకాళి దేవాలయం ఈఓ శేషుభారతి అధికార దుర్వినియోగంపై వరంగల్ దేవాదాయశాఖ ఉప కమిషనర్ శ్రీకాంతారావుకు రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్, జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజు గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదులో భద్రకాళి దేవాలయంలో భక్తులకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయట్లేదని, వ్యాపారులు, సిబ్బంది భక్తులను దూషిస్తున్నట్లు పేర్కొన్నారు.

తక్కువ రేట్‌కు కోట్ చేస్తూ..

భక్తులు కొబ్బరికాయలు కొట్టిన తర్వాత వచ్చే నీటిని మళ్లీ భక్తులకే విక్రయిస్తుండడం అపరిశుభ్రంగా భావిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పూలు అధిక ధరకు అమ్ముతున్నారని, అమ్మవారికి సారె రూపంలో సమర్పించే చీరలు అతి ఖరీదైనవి తక్కువ రేటు కోట్ చేస్తూ.. బయట అధిక ధరలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. దేవాలయ ఆడిటింగ్ విషయంలో ఇంకా ఎన్ని లోపాలు ఉన్నాయో గమనించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెప్పుల స్టాండ్‌లో దేవాలయం ఉద్యోగి ఒక వ్యక్తిని పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులివ్వని వారిని దూషిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈఓ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకుండా వారికి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈఓ విధి నిర్వహణలో లోపాలున్నాయని, తప్పు చేసిన ఉద్యోగులపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తగు విచారణ జరిపి తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు రాజు, సూర రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భద్రకాళి అమ్మవారు